# పాప కోసరం

జి.వి.జి



శ్యామల తలుపు తెరవగానే నిర్ఘాంత పోయింది.

"అలా చూస్తారేమిటండీ? నేనే - దుర్గను. మీ వారున్నారా?"

"ఉన్నారు, కాని....వాణి లేదు.... బడికి వెళ్ళింది" శ్యామల కంఠం తడబడింది.

"ఓహో!" అంది దుర్గ హాల్లోకి తొంగి చూస్తూ. "నా రాక మీకు ఆశ్చర్యం కలిగించిం దేమో— నన్నిలా బయటే నిలబెట్టేసి మాట్లాడుతున్నారు మరి."

శ్యామల కాస్త పక్కకు తప్పుకొని వెను తిరగడంతో ఆమె వెనుకే దుర్గ హాల్లోకి అడు గెట్టింది. దుర్గను చూసి గిరి ముఖం చిట్లిం చాడు. అతని ఎదురుగా సోఫాలో ఉస్సూరు మని కూర్చుంటూ, "నిద్ర లేవగానే ఎవరి ముఖం చూశానో! అమ్మాయిని చూడాలని గంపెడాశతో వచ్చాను. బడికి వెళ్ళిందటగా?" అని నిట్టూర్చింది దుర్గ.

"ఒకవేళ ఇంట్లో ఉన్నా - మీరు చూడ గలిగేవారా?" అన్నాడు గిరి.

"అంటే?"

"మళ్ళీ ఈ ఛాయలకు రానన్నారుగా? ఏడేళ్ళ క్రితం మీరు మాటిచ్చారు. గుర్తుందా?"

"ఏడేళ్ళా! ఎంత గిర్రున తిరుగుతోంది కాలచక్రం! ఈ ఏడేళ్ళలో అమ్మాయి ఎంతగా మారిపోయి ఉంటుందో!"

"చూడండి. నేనింకో అరగంటలో మా ఆఫీసులో ఉండాలి. ఇక అసలు విషయానికి రండి."

"అసలు విషయం ఏముందీ? నా మనసు మార్చుకున్నాను. నాకు అమ్మాయి కావాలి."

"అక్కర్లేదనుకున్నప్పుడు ఇచ్చేసి, కావా లనుకున్నప్పుడు తీసుకెళ్ళడానికి వాణి ఏమైనా బొమ్మ అనుకున్నారా?"

"అది నా బొమ్మే; బంగారు బొమ్మ. నేను దాని తల్లిని."

"ఏడేళ్ళ క్రితం ఆ పాప ఉన్నా ఒకటే- పోయినా ఒకటే అని మాతో అన్నప్పుడు ఈ తల్లిప్రేమ ఏమైంది?" అంది శ్యామల.

"తల్లిప్రేమ అంటే ఏమిటో- గొడ్రాలివి- నువ్వు నాకు చెప్పొస్తున్నావా? హృదయం లేని నీ దగ్గర అమ్మాయి ఇంత కాలంగా ఎలా పెరుగుతోందో ఆశ్చర్యమే మరి," అంది దుర్గ.

"దుర్గమ్మగారూ! మాటలు తిన్నగా రాని య్యండి. ఆనాడు మీరడిగినంత డబ్బు మీ ముందు కుమ్మరించి అమ్మాయిని స్వీకరించాం. కన్నతల్లి కన్నా ఎక్కువగానే పెంచాను. వాణిని మేం దత్తతకు స్వీకరించినట్లే లెక్క."

"అదేదో కోర్టే తీర్పు చెబుతుంది లెండి."

"బెదిరిస్తున్నారా?" శ్యామల ముఖం జేవు రించింది.

"నువ్వేలాంటి తల్లివో నిరూపించడం కష్ట మనుకుంటున్నావా?" అంటూ గిరి చివాలున లేచి, "శ్యామలా, ఆమెతో మనకు మాట లెందుకు? నాకు వేళవుతోంది. కోట్ అందుకో," అన్నాడు.

దుర్గ హేండ్‌బాగ్‌లోంచి చేతి రుమాలు తీసుకొని ముఖం అద్దుకుంటూ, "సరే.... కన్నప్రేమ కన్నా పెంచిన ప్రేమే గొప్ప అంటారు. అంతేనా? కాని, వాణి కన్నతల్లి ఇప్పుడు కష్టాల్లో ఉంది. వాణి ముఖం చూస యినా ఆ తల్లికి కాస్త సహాయం చేయండి," అంది.

"ఇంకా ఏమిటి సహాయం?" అన్నాడు గిరి కోట్ తొడుక్కుంటూ.

"నేను జబ్బుతో ఉన్నాను. క్షయ. మును పటిలా వొళ్ళు వొంచి పని చేయలేను. మందు లకు మాకులకు వారానికి కనీసం యాభై రూపాయలైనా ఖర్చవుతుంది."

"దానికి నేనేం చేయను? నువ్వొచ్చి అడిగి నప్పుడల్లా ఇవ్వడానికి మా పెరట్లో డబ్బు కాచే చెట్టు ఏమైనా వేశాననుకున్నావా? కావ లిస్తే, ఒక వంద రూపాయలిస్తాను. అంతే. పట్టుకెళ్ళు. మళ్ళీ నీ ముఖాన్ని మాకు చూపిం చకు."

"మీరింత కఠిన హృదయులని తెలిసి ఉంటే, ముక్కుపచ్చలారని నా బిడ్డను చూస్తూ చూస్తూ మీ చేతుల్లో పెట్టి ఉండే దాన్ని కాను. దాన్ని మీకు కనిపించేలా ఆ గుడి ముందు వదలక, తీసుకెళ్ళి ఏ అడవిలోనో వదిలిపెట్టి ఉండేదాన్ని. లేకపోతే గొంతు పిసికి ఏ బావిలోనో పడేసి ఉన్నా బావుండేది."

"ఇదన్న మాట మీ కన్నప్రేమ?" అంది శ్యామల.

గిరికి కూడా ఆవేశం ఆగింది కాదు. "నువ్వీక ఇక్కణ్నుంచి ఎంత త్వరగా బయ టకు వెళ్ళిపోతే అంత మంచిది."

"వెళ్ళిపోడానికే గాని, నే నిక్కడ ఉండ డానికి రాలేదుగా? ఏదో ఒకటి తేల్చేయండి. నాకు నా వాణినయినా ఇవ్వండి. లేదా అయిదు వేలయినా ఇవ్వండి."

"రెండూ ఇవ్వం."

"అంతేనా?"

"అంతే. ఆశకు అంతు అనేది ఉండాలి. మొదట కాళ్ళా వేళ్ళా పడి బేరమాడి పది వేలు తీసుకెళ్ళావ్. మళ్ళీ ఇప్పుడు అయిదు వేలడగడానికి నీకు నోరెలా వస్తుంది? ఇంతటితో పోతుందని ఏముంది? మళ్ళీ డబ్బు కావాలని వస్తావ్. దీనికి మితం ఎక్కడ?"

"నా వాణి అంతకన్నా ఎక్కువే విలువ చేస్తుంది."

"అలాగా! ఐతే, వెంటనే ఒక లాయర్‌ను చూడు."

"చూడననుకుంటున్నారా? కాని, ఒకటి మాత్రం చెబుతున్నాను. గోటితో పోయేదానిని మీరు గొడ్డలివరకు తీసుకొస్తున్నారు. నేను వాణిని మీకు శాశ్వతంగా అప్పగించినట్లు ఏ పత్రం మీదా సంతకం పెట్టివ్వలేదు. తెలుసా? మీ చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనముండదు," అని దుర్గ అంటూండగా, "మీకు టయిమ్ అయినట్లుంది. బయలుదేరండి" అంటూ శ్యామల ఒక సూట్‌కేస్ తెచ్చి భర్తకు అందించింది.

ఆ దంపతుల వంక చురచుర చూస్తూ దుర్గ లేచి నిలుచుంది. "మీరిక వాణిమీద ఆశలు వదులుకోవలసిందే," అంటూ వడివడిగా అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

"ఏమండీ!" అంది శ్యామల, భర్త కళ్ళల్లోకి దీనంగా చూస్తూ.

"ఏం భయంలేదు" అన్నాడు గిరి, ఆమె భుజంమీద మెల్లగా తడ్తూ.

* *

"ఎవరికోసం చూస్తున్నావమ్మా?"

దుర్గ త్రుళ్ళిపడి, పక్కకు తిరిగింది.

"నీ కెవరు కావాలి?" అని మళ్ళీ అడిగిన ఆ వ్యక్తికి దాదాపు ముప్పై ఏళ్ళుంటాయి.

"ఈ కోర్టు కాంపౌండ్‌లో చెట్లకింద తక్కువ ఫీజుకు లాయర్లు దొరుకుతారని ఎవరో చెప్పారు" అంది దుర్గ.

ఆ మనిషి ఆమెకు మరింత దగ్గరగా వచ్చాడు. "ఓ....నువ్వా? నీ పేరు దుర్గమ్మ కదూ?"

దుర్గ విస్మయంగా చూస్తూ, "నిన్నెక్కడా చూసినట్లు లేదే!" అంది.

"చూడలేదు. కాని, నీ గురించి నాకు తెలుసు."

"ఏం తెలుసు?"

"నీ కిప్పుడు ఓ మనిషి సహాయం కావాలి."

"ఎలా తెలుసు?"

"నిన్న ఉదయం నిన్ను గిరిబాబు గారింట్లో చూశాను."

"అలాగా! నువ్వక్కడ నాకు కనిపించినట్లు లేదే!"

"నువ్వొచ్చినప్పుడు నే నక్కడ హాలు పక్కగదిలో బట్టలు ఇస్త్రీ చేస్తున్నాను."

"అక్కడ నౌఖరువా?"

"నిన్న సాయంత్రం దాకా."

"అంటే?"

"ఆ తర్వాత పని మానేశాను."

"ఎంచేత?"

"వాళ్ళింట్లో అది మామూలే. అక్కడ ఏ నౌఖరూ వారం రోజులకన్నా ఎక్కువ ఉండడు. పది రోజులకుమించి ఉన్నది నే నొక్కడ్నే. కాస్త ఐశ్వర్యం ఎక్కువ వచ్చేసరికి ఆ భార్యాభర్త లిద్దరికీ కళ్ళు నెత్తికెక్కాయి. ఏం మిడిసిపాటనుకున్నావు? బజారు నించి కాస్త ఆలస్యంగా రావడం నా తప్పే అనుకో. దానికి అంతేసి మాటలంటే ఈ కాలంలో ఎవరు ఊరుకుంటారు? అంచేత ఒక్క దండం పెట్టి వచ్చేశా. అంతటితో వూరుకుంటా ననుకుంటున్నావా? వాళ్ళమీద కసి తీర్చుకోనూ?"

"నీలాంటి వా రెవరో ఒకరు తగిన బుద్ధి చెబితే సరి."

"అసలు విషయం నీకు తెలుసా? నీ కూతురు వాళ్ళింట్లో కాలు మోపినప్పట్నుంచే వాళ్ళకీ దశ తిరిగింది."

"ఐతే, నా కూతురు విషయం నీకు తెలుసన్న మాట?"

"నిన్న ఆ పక్క గదిలోంచి అంతా విన్నాగా? నాకే గుండె కలుక్కుమంది. నువ్వడిగిన ఐదు వేలు పారేస్తే, వాళ్ల సిరి ఏం తరిగిపోతుంది? పోయేటప్పుడు ఈ ఐశ్వర్యాన్నంతా మూట కట్టుకుపోతారా?"

"బాగా చెప్పావు."

"నువ్వు ఐదువేల కోసం లాయరిని చూడలనుకుంటున్నావు. నేనే నీ స్థితిలో ఉంటేనా— లాయర్ లేకుండా వాళ్ళ ముక్కుపిండి యాభై వేల దాకా వసూలు చేసి ఉండేవాడ్ని."

"యాభై వేలే!"

"అంతే....కుక్కకాటుకు చెప్పుదెబ్బ...."

"అంటే? అదేమిటో నా బుర్రకు సరిగ్గా ఎక్కేటట్లు చెప్పు, నాయనా!"

"సమయం చూసి నీ కూతుర్ని దొంగతనంగా తీసుకెళ్ళిపో."

"ఏమిటి, దొంగతనమా! నా పాపను నేను దొంగిలించడమా?"

"అంతే. వేరే మార్గం లేదు. ఆ పాపను వాళ్ళు ప్రాణసమానంగా పెంచారు. ఆ పాప పైనే వాళ్ళ పంచప్రాణాలూ. పాపను వదలి ఒక్కక్షణమైనా ఉండలేరు."

"పాప కనిపించకపోతే వాళ్ళు పోలీస్ రిపోర్ట్ ఇస్తే?"

"ఇస్తే ఏం? అసలు ఒక రెండు మూడు రోజులపాటు నువ్వు నీఇంట్లో ఎందుకుంటావు? ఏ హోటల్లోనో గదిని అద్దెకు తీసుకో. అక్కడ్నుంచి గిరిబాబు ఇంటికి ఫోన్‌చేసి యాభై వేలిస్తే అమ్మాయిని అప్పగిస్తాననూ."

"నా మొహంలా ఉంది నీ సలహా. పాపను దొంగిలించినందుకు నన్ను కొట్లో తోస్తారు."

"నీకేమైనా మతిపోయిందా? నీ బిడ్డను నువ్వు తీసుకెళ్ళిపోవడం నేరమెట్లా అవుతుంది?"

"అంతేనంటావా?" దుర్గ కాస్సేపు ఆలోచించింది. "బాగానే ఉంది. కాని, అమ్మాయిని ఎలా దొంగిలించడం?"

"అది చాలా తేలిక. ఆ అమ్మాయిని ఉదయం స్కూల్ దగ్గర గిరిబాబుగారే కారులో తీసికెళ్ళి దిగబెట్టారు. సాయంత్రం మాత్రం ఆ అమ్మాయి మిగతా పిల్లలతో కలిసి బస్సులో ఇంటికి చేరుకోవడం మామూలు."

"అలాగా!"

"ఆ అమ్మాయి దగ్గిరికి వెళ్ళి నిన్నువాళ్ళమ్మ పంపించిందని చెప్పు."

"నే నెవరని ఆ పిల్ల అడిగితే?"

"ఆ పూటే వాళ్ళింట్లో కొత్తగా పని మనిషిగా చేరావని చెప్పు."

"ఏమిటీ! నా కూతురికి నేను పనిమనిషినని చెప్పుకోవడమా?"

"తప్పేముందీ? డబ్బు....యాభై వేలు."

"సరే....తర్వాత?"

"ఆ అమ్మాయికి వాళ్ళమ్మ పండగకు కొత్త బట్టలు కొనడానికి ఏ సూపర్ బజార్‌కో వెళ్ళిందనీ, బడి వదిలాక అమ్మాయిని సరాసరి అక్కడికే తీసుకురమ్మని నిన్ను పంపించిందనీ చెప్పు. నమ్మక ఏం చేస్తుందీ? తర్వాత ఏ టాక్సీలోనో ఆ అమ్మాయిని ఏ హోటల్‌కో తీసుకెళ్ళు."

"మెజిస్టిక్ లాడ్జికి తీసుకెళ్తా. నేను అప్పుడప్పుడు ఆ లాడ్జికి వెళ్తుంటాను. అక్కడ నాకు అందరూ తెలుసు."

"ఐతే ఇకనేం....ఆ లాడ్జినించి గిరిబాబు గారింటికి ఫోన్ చెయ్యి. దాంతో ఇక రొట్టె విరిగి నేతిలో పడ్డట్లే."

దుర్గ ముఖం విప్పారింది. "మంచిసలహా ఇచ్చి నా నెత్తిన పాలు పోశావు. ఆ భగవంతుడే నిన్ను నా దగ్గిరికి పంపించి ఉండాలి."

"లేదు. ఆ భగవంతుడే నువ్వు నాకు కనిపించేలా చేశాడు. లేకపోతే నా కసి నేనెలా తీర్చుకోగలను?"

"నీ పేరు?"

"రంగడు."

"రంగయ్యా! లాయర్‌ని చూసినా నాకింతటి సలహా దొరికి ఉండేది కాదు. ఒక విషయం చెప్పనా? నిన్ను చూస్తే, నీ బుర్రలో ఇంతేసి ఆలోచనలుంటాయని ఎవ్వరూ అనుకోలేరు."

"నిజానికి నాది మట్టిబుర్రే. కాని, ఇలాంటి సమయాలలో అద్భుతంగా పని చేస్తూంటుంది."

"అంతా అనుకున్నట్లే జరిగి, నాకు యాభై వేలు దక్కితే-అందులో నీకు ఐదువేలిస్తాను."

"నిజంగానా, దుర్గమ్మా!"

"నా బిడ్డమీద ఒట్టు."

"ఛా....అంత మాటనకు."

"తప్పేం లేదు, రంగయ్యా! నీ దగ్గర చెప్పడానికి సిగ్గేముందీ? నన్ను పెళ్ళాడతానని నమ్మించి, ద్రోహం చేసిన ఒక దుర్మార్గుడివల్ల కలిగిన పిల్ల అది. దానిమీద నాకు తల్లిప్రేమ ఉందని ఎలా అబద్ధమాడను? దాన్ని నేను పోషించలేకనే కదా పెంచుకోడానికి వాళ్ళకిచ్చాను."




"ఐతే, ఇక ఆలస్యం దేనికి? గంట మూడయింది. బడి వదిలే సమయం. బయలుదేరు."

"నన్ను బయలుదేరమంటావేం? నువ్వు రావూ?"

"ఇప్పుడు నేనెందుకూ? ఆనక ఆ లాడ్జిలో కలుసుకుంటాగా నా వాటాకోసం?"

"అది కాదు, రంగయ్యా! అది ఏ బడో, ఎక్కడుందో నాకేం తెలుసు. అసలు నువ్వొచ్చి చూపించకపోతే మా అమ్మాయి ఫలానా అని నాకెలా తెలుస్తుంది?"

"ఏమిటి, దుర్గమ్మా, నువ్వనేది? మీ అమ్మాయి ఎలా ఉంటుందో నీకు తెలీదా? కన్నబిడ్డను ఆ మాత్రం గుర్తించలేవా?"

"ఏడేళ్ళ క్రితం పసికందుగా చూశానంతే."

"వచ్చాను పో....ఐతే,పద.... ....నన్ను చూస్తే ఆ అమ్మాయికి ఏదైనా అనుమానం కలగవచ్చు. అంచేత కాస్త దూరంనించి నీకా అమ్మాయిని చూపిస్తా."

* * *

స్కూల్ కాంపౌండ్ దాటి పిల్లలు విలవిలమని బయటకు వస్తున్నారు.

"ఏమిటి మేకల మందలా మరీనూ," అని విసుక్కుంది దుర్గ.

"అదో-ఆ బస్ స్టాప్ కేసి పరుగెత్తుతోందే....ఆ అమ్మాయే," అన్నాడతను.

"ఆ అమ్మాయా? ఎంత ముద్దొస్తోంది! నా పిచ్చిగాని నా కూతురు ముద్దొచ్చేలా ఉండక మరెలా ఉంటుంది!"

"మాతృత్వం పొంగడమంటే అదే.... నేనిక వెళ్తాను. ఇక లాడ్జిలోనే కలుసుకుంటాను. గిరిబాబుగారింటి టెలిఫోన్ నెంబర్ గుర్తుందిగా? ఊఁ....త్వరగా వెళ్ళు. ఆ అమ్మాయి గుంపులో కలిసిపోతే గుర్తించలేవు" అంటూ అతను వెళ్ళిపోయాడు.

ఆ అమ్మాయి వంకే రెప్పలార్పకుండా చూస్తూ దుర్గ ముందుకు నడిచింది. ఆ అమ్మాయి దగ్గరయ్యే కొద్దీ గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఒకసారి ఇటు అటు చూసి, గొంతు సవరించుకొని, "నీ పేరు వాణీ కదూ?" అంది.

"నువ్వెవరు?" అందా అమ్మాయి.

"మీ ఇంట్లో ఈ వేళ కొత్తగా చేరాను. నా పేరు లక్ష్మి."

"అలాగా....అదో బస్సు వస్తోంది."

"అమ్మాయ్," అంటూ దుర్గ చివాలున ఆ అమ్మాయి చేతిలోని బాగ్ అందుకొని, "మీ అమ్మ నన్నిక్కడికి ఎందుకు పంపిందో తెలుసా? నువ్వీ పూట బస్సులో ఇంటికి వెళ్ళక్కర్లేదు. నిన్ను టాక్సీలో సరాసరి సూపర్ బజార్‌కు తీసుకు రమ్మని నన్ను మీ అమ్మ పంపించింది. అక్కడ నీ కోసం పండుగకు కొత్త బట్టలు కొంటున్నారు."

"కొత్త బట్టలా?" ఆ అమ్మాయి కళ్ళు ప్రకాశవంతమయ్యాయి.

"అదో టాక్సీ....రా-పోదాం."

టాక్సీలో కూర్చున్నాక దుర్గ మెజిస్టిక్ లాడ్ పేరు చెప్పేసరికి ఆ అమ్మాయి విచిత్రంగా చూసిందే కాని, ఏమీ అడగలేదు. ఆ లాడ్జి ముందు టాక్సీనించి దిగినప్పుడే "ఇది

హోటల్లా ఉందే! ఇక్కడి కెందుకు? బట్టలు ఇక్కడ అమ్ముతారా?" అని అడక్కుండా ఉండలేక పోయింది.

"కాదమ్మా, మీ అమ్మ మనల్ని ఇక్కడ ఎదురు చూస్తూండమంది. కాస్సేపట్లోనే మీ అమ్మ ఇక్కడికే వచ్చి మనల్ని కలుసుకుంటుంది."

"మనల్ని ఇక్కడ ఎందుకు ఉండమంది?"

"నాకు తెలీదు. రా..........లోపలికెళ్ళి కూర్చుందాం," అంటూ దుర్గ, ఆ అమ్మాయిని ఒక గదిలోకి తీసుకెళ్ళింది. ఆ అమ్మాయి గది నాలుగు వైపులా పరికించి చూసి, కిటికీ దగ్గర కుర్చీలో కూర్చుంది. "అబ్బ! బయట ఎన్ని రకాల పూల మొక్కలున్నాయో!" అంది. దుర్గ అదృష్టవశాత్తు ఆ అమ్మాయి ఏ మాత్రం అనుమానించకుండా తన బాగ్ లోంచి కామిక్ బుక్‌లు తీసి తాపీగా చూస్తూ కూర్చుంది. పది నిమిషాలయ్యాక "అమ్మ రాలేదే! మనమిక్కడ ఉంటామని అమ్మకు తెలుసా?" అంది.

"తెలుసు. అందుకేగా మనల్ని ఇక్కడ ఉండమన్నది?"

"మరి నాకు ఆకలిగా ఉందే. బడినించి ఇంటికి వెళ్ళగానే అమ్మ నాకు తినడానికి ఏమైనా ఇస్తుంది."

"నా మతి మండిపోనూ — మరచేపోయాను. నీకు ఇవ్వమని మీ అమ్మ బిస్కట్ పాకెట్‌లు నాకిచ్చింది," అంటూ దుర్గ తన హేండ్‌బాగ్‌లోంచి రెండు పాకెట్‌లు తీసిచ్చింది. "పాలు తెప్పించనా?"

"అక్కర్లేదు. ఇంటి దగ్గర తాగుతా!"

"నువ్వు చాలా మంచి పాపవి," అంటూ దుర్గ ఆప్యాయంగా ఆ అమ్మాయిని ముద్దెట్టుకుంది.

"అమ్మ ఇంకా రాలేదే?"

"నే వెళ్ళి ఫోన్‌చేసి కనుక్కొని రానా? నువ్విక్కడే ఉండు. నా బంగారు తల్లివి కదూ?" అంటూ దుర్గ ఆ గది తలుపు దగ్గరికి వెళ్ళబోయిందో లేదో—ఇద్దరు వ్యక్తులు ఎదురొచ్చారు. ఒకతను రంగడుగా ఆమెకు పరిచయమైన వ్యక్తి; మరొకతను పోలీస్ యూనిఫామ్‌లో ఉన్నాడు.

దుర్గ అయోమయంగా చూసింది.

"నిన్ను అరెస్ట్ చేయడానికి వచ్చాం," అన్నాడా ఇన్‌స్పెక్టర్.

"నన్నా! పొరబడుతున్నారేమో! మీ కసలు కావలసింది ఎవరు? నా పేరు దుర్గ. కావలిస్తే ఆ రంగయ్యను అడగండి."

"ఆ అమ్మాయిని మాయమాటలతో మోసం చేసి ఇక్కడికి తీసుకొచ్చి ఈ గదిలో బంధించింది నువ్వేగా? తగిన సాక్షులున్నాయి. నువ్వు నేరాన్ని ఒప్పుకోక తప్పదు."

"నేరమేమిటి? ఈ అమ్మాయి నా కూతురు. కావలిస్తే బర్త్ సర్టిఫికేట్ సంపాదించి రుజువు చేయగలను. నాకూతురి మీద నాకులేని హక్కు మరెవరికి ఉంటుంది? నా కూతుర్ని నే నిక్కడికి తీసుకురావడం నేరమెలా అవుతుంది?"

"కాని, ఈ అమ్మాయి నీ కూతురు కాక మరొకరి కన్న బిడ్డ అయితే, ఈ అమ్మాయిని అపహరించుకు వచ్చిన నేరస్థురాలివని ఒప్పుకుంటావా?"

"ఈ అమ్మాయి నా కూతురెందుకు కాదు? నువ్వాయనకు చెప్పు, రంగయ్యా, అలా బెల్లం కొట్టిన రాయికి మల్లే నోరు మెదపకుండా ఊరుకున్నావేం?"

"ఆ అమ్మాయి నీ కూతురూ కాదు; నా పేరు రంగయ్యా కాదు," అంటూ ఆ వ్యక్తి తలపాగా, పెట్టుడు మీసం తీసేస్తూ, "నా పేరు చాణక్య అంటారు. డిటెక్టివ్‌ని," అన్నాడు.

దుర్గ విస్మయంలోంచి తేరుకోడానికి కొన్ని క్షణాలు పట్టింది. "మీలాంటి పెద్దలు చేయవలసిన పనేనాండీ ఇది? నన్ను అవస్థలపాలు చేయాలని చూస్తారా?"

"గిరిబాబుగారిని నువ్వు అవస్థలపాలు చేయడానికి ప్రయత్నించడం న్యాయమా? ఏడేళ్ళ క్రితం నీ కూతుర్ని పెంచుకోమని వాళ్ళకు ఇచ్చేశావు. పదివేల రూపాయలు ముట్టాయి. కాని, ఆ అమ్మాయిని వాళ్ళకు నువ్వు శాశ్వతంగా అప్పగించినట్లు ఏ పత్రంమీదా సంతకం పెట్టివ్వలేదంటూవచ్చి, మరో అయిదువేలు కావాలని బెదిరిస్తావా? కుక్క కాటుకు చెప్పు దెబ్బ—అంటే ఇదే. గిరిబాబుగారు నీకు ఆఖరుసారిగా ఓ రెండు వేలివ్వడానికి నిశ్చయించారు. ఆ డబ్బు పుచ్చుకొని, నీ అమ్మాయిని వాళ్ళకు పెంపకానికి ఇచ్చేసినట్లు నువ్వొక పత్రంమీద సంతకంచేసి ఇవ్వాల్సి ఉంటుంది. ఏమంటావ్? లేకపోతే, ఇప్పుడు నిన్నీ పరిస్థితుల్లో నేరస్థురాలిగా ఇక్కడ అరెస్టు చేయవలసి వస్తుంది," అంటూ చాణక్య తన షర్టు జేబులోంచి ఒక వందరూపాయల నోట్లకట్ట, ఒక కాగితం తీశాడు. "ఇదో పత్రాన్ని సిద్ధం చేసి తెచ్చాను. రెండువేలు కూడా రెడీయే. ఈ ఇన్‌స్పెక్టర్‌గారి దగ్గర బేడీలున్నాయి. నీకు ఏది కావాలి?"

"బేడీలు కోరుకుంటారేమిటీ ఎవరైనా? కలం ఇవ్వండి. పత్రంమీద సంతకం పెడ్తా," అంది దుర్గ.

ఇంతలో ఆ అమ్మాయి దుర్గ దగ్గరికివచ్చి, "ఇదిగో నువ్విచ్చిన బిస్కట్ పాకెట్‌లు," అంటూ ఆ పాకెట్‌లు అందించింది.

దుర్గ నివ్వెరపోయింది. "ఏమిటీ, ఒక్క బిస్కట్ అయినా నువ్వు ముట్టుకున్నట్లులేదే!"

"ముట్టుకోకూడదని మానాన్న చెప్పారు. కదు, డాడీ?" అంటూ అ అమ్మాయి, చాణక్య దగ్గరికి వచ్చింది. దుర్గ మరింత నిర్ఘాంతపోయింది. "ఈ పిల్ల మీ కూతురా?"

"అవును. పేరు రేణుక. మీ వాణి క్లాస్‌మేటే. అప్పుడప్పుడు సినిమాలలో నటిస్తూంటుంది కూడా."

"పెద్దయితే పెద్ద స్టార్ అవుతుంది లెండి," అంటూ దుర్గ, ఇన్‌స్పెక్టర్ చేతిలోని కలాన్ని అందుకుంది.

